# శ్రీటైగ్రేడ్

ఓంశ్రీసాయిరాం

సూపర్ స్పెషాలిటీస్ ఆసుపత్రికి ఒక స్పెషల్ మిషను అందించినవాడు టైగ్రేడ్ అనే వ్యక్తి. అతను ఎంతో ఉత్సాహముతో చాలా ఆదునిక యంత్రములను అమెరికానుండి పంపించాడు. వాటి విలువ యించుమించు ఇరవై కోట్లు. మనము యంత్రాలు తెప్పించుకోవాలంటే చాలా కష్టము. ఎంత శ్రీమంతుడైనా గవర్నమెంటు పర్మిషను కావాలి. అంతేకాకుండా ఇక్కడకు వచ్చిన తరువాత ఒక రూపాయి పదార్థమునకు పది రూపాయలు టాక్సు కట్టాలి.

ఈనాడు ఆసుపత్రులన్నీ ఒక వ్యాపార సంస్థలుగా రూపొందుతున్నాయి. పది కోట్లు పెట్టి ఆసుపత్రి ప్రారంభించారంటే నూరు కోట్లు ఆదాయము ఆశిస్తుంటారు. ఇలాంటి స్వార్థము, స్వప్రయోజనము కోసము ఆసుపత్రులు నిర్మిస్తున్నారు. కాని, సాయియందు కాలి మొదలు తలవెంట్రుక వరకు నిస్వార్థమే. ఏమాత్రమూ స్వార్థము లేదు. అలాంటి సత్యాన్ని ఎవరూ గుర్తించటానికి ప్రయత్నించటము లేదు. అట్టి హృదయాన్ని గుర్తించిన టైగ్రేడ్ తన శక్తికొద్దీ ప్రయత్నముచేసి తగిన సహాయము చేస్తూవచ్చాడు. ఆయన అంతటితోనే విరమించుకోలేదు. ఇంకా ముమ్ముందు అభివృద్ధి కావాలని చాలా ఆశ పడుతున్నాడు. ఇట్టి పరోపకార సంబంధమైన కార్యములు యిలాంటి వ్యక్తులలో అభివృద్ధి కావాలి. ధనము సంపాయించ వచ్చు. కాని, సంపాయించిన ధనము సద్వినియోగము చేసినప్పుడే ఆ ధనమునకు కూడను గౌరవము ఉంటుందిగాని సంపాయించిన ధనమంతా ఏ విదేశాల్లోనో పెట్టి కట్టకడపటికి కన్ను మూస్తున్నారు. ఆ ధనము సద్వినియోగము చేయాలి. ఆ సద్వినియోగముచేసే బుద్ధులు అందరికీ పుట్టవు. ఏ నూటికో కోటికో ఒకరికి పుడుతుంటాయి. అలాంటి త్యాగభావముచేత టైగ్రేడ్ మన ఆసుపత్రికి చాలా సహాయము చేశాడు. అతనికి స్వామిపైనున్న భక్తివిశ్వాసములే దీనికి కారణము. ఈ భక్తివిశ్వాసములు పరోపకార సంబంధమైన కార్యములలో ప్రవేశ పెట్టటం చాలా ఉత్తమ మార్గం. న్యూయార్క్‌లో ఉండే టైగ్రేడ్ ఈ కుగ్రామమైన పుట్టపర్తి వచ్చి ఈవిధముగా దానము చేయటమనేది, అది ఎక్కడ చేసినా ఒక్కటేగాని అతని భావము ఈవిధముగా ఆకర్షించింది. అతనిని వర్ణించటం కాదు. అతని త్యాగానికి ఆనందించటమే. ఇంతటితోగాక ముమ్ముందుకూడా యిలాంటి కార్యములలో టైగ్రేడ్ యింకా త్యాగమును అభివృద్ధి గావించుకోవాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.

సత్యసాయి విద్యాగిరి,

23.11.1990.